క్లుప్తంగా

నవరస భరితం సాంస్కృతిక సమ్మేళనం



విజయవాడ కల్చరల్: శరన్నవరాత్రుల్లో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని కళావేదికపై సోమవారం ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు 12 గంటల పాటు సాగాయి. దేవాలయం వాయిద్య కళాకారుల వాద్య సమ్మేళనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రమీలారాణి బృందం తాళ భజన, జి.రామలక్ష్మి బృందం, దుర్గేషు నందిని భక్తి రంజని, అంజనా సుధాకర్ శాస్త్రీయ సంగీత కచేరి, మడలమ రాంబాబు భక్త కుచేల హరికథ, నందిని, అపర్ణా ప్రసాద్ బృందం సత్యవాణి బృందం, గన్నవరానికి చెందిన నటరాజ డాన్స్ స్కూల్, హరిత, సాత్విక, శ్రీవల్లి తమ బృందాలతో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి కీర్తనలకు నృత్యాలను అభినయించారు. సహాయ కార్యనిర్వహణ అధికారి గంగాధర్ కార్యక్రమాలను ప్రారంభించారు. సైదా, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు ప్రశంసా పత్రాలను, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

వించిపేట(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో మొదటి రోజు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. భక్తులకు ఎక్కడ కూడ ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు ఒక వరం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపు నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వరమని పలువురు బీజేపీ నేతలు పేర్కొన్నారు. జీఎస్టీ శ్లాబ్‌ల మార్పుపై మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ బీజేపీ ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వన్‌టౌన్ బాలాజీ స్వీట్స్ దగ్గర నుంచి వ్యాపార వర్గాలకు ప్రచారం చేస్తూ సామరంగంచౌక్, ఐరన్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా వినాయకుడి గుడి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సీనియర్ నేతలు షేక్ బాజీ, అవ్వారు బుల్లాబ్బాయి, మాదాల రమేష్, పైలా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం దొమ్మర్ల సామాజిక వర్గం గుర్తింపును గిరిబలిజగా మార్పు చేస్తూ చేసిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. పాతబస్తీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల నుంచి పరిష్కారానికి నోచుకోని కాపు బీసీ రిజర్వేషన్ కోసం పోరాడుతుంటే ఇంతవరకు తమకు సరైన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దొమ్మర్ల సామాజిక వర్గం గుర్తింపు కోసం ఈ విధమైన జీఓ ఇవ్వడం వల్ల కాపుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై కాపులకు న్యాయం చేయాలని కోరారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నేతలు బత్తుల దుర్గారావు, గౌరి బొమ్ము మధు, సంకాబత్తుల అశోక్, వడ్డాది శివసత్యనారాయణ, నంది బాబురావు, వెన్నం రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బతుకమ్మ తల్లి ఊరేగింపు



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలను పురస్కరించుకుని బతుకమ్మ దేవి నవరాత్రుల వేడుకలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విద్యాధరపురంలోని అష్టాక్షరి రామమందిరం వద్ద నుంచి మేళతాళాలు, మహిళల కోలాటం నడుమ గుప్తా సెంటర్‌లోని శ్రీవాసవి కల్యాణమండపం వరకు బతుకమ్మను పుర వీధుల్లో ఊరేగిస్తూ తీసుకువచ్చారు. నిర్వాహకురాలు, కౌసల్య సుప్రభాత సేవ సమితి అధ్యక్షురాలు సువర్చల మాట్లాడారు. వాసవి కల్యాణ మండపంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపు చేస్తున్న దృశ్యం



మహామండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



సూర్యనమస్కార పూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



శ్రీచక్రపూజ నిర్వహిస్తున్న అర్చకులు



కలెక్టర్ జి.లక్ష్మీశా కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రసాదం అందిస్తున్న ఈవో



ఆలయం ఎదుట నృత్యాలు, విన్యాసాలు ప్రదర్శిస్తున్న కళాకారులు



ప్రత్యేక కుంకుమ పూజలో భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఉప్పొంగిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి ఉప్పొంగింది. దసరా శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పండుగ వాతావరణం నెలకొంది. వేలాది మంది రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఫైర్ ఇంజిన్‌కు దారి లేనంతగా ప్రోటోకాల్ వాహనాల పార్కింగ్

పాతబస్తీలో ప్రారంభమైన ఉత్సవాలు



మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

- ప్రత్యేక అలంకారాల్లో అమ్మవార్లు
- సందడిగా ఆలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం పాతబస్తీలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి వీధిలోనూ దసరా ఉత్సవాల సందడి దర్శనమిచ్చింది. వన్‌టౌన్ కేటీరోడ్డులోని శ్రీనివాసమహల్ సెంటర్‌లో కొలువై ఉన్న గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారికి శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. బ్రాహ్మణవీధిలోని చదును మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు రజిత కవచాలంకృత మహాలక్ష్మీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీభ్రమరాంబ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమార్చనలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు రజితకవచాలంకృత భ్రమరాంబాదేవిగా దర్శనమిచ్చారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన పద్మావతి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట సైకంవారి వీధిలోని దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీదేవి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు మురళి కార్యక్రమాలను పర్యవేక్షించారు. గంగా పార్వతీ సమేత వసంత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో అమ్మవారి దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్త అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ముదిలి గణేష్, విజయ దంపతులు కలశపూజను నిర్వహించారు. అమ్మవారికి లింగిపిల్లి రామకృష్ణ, శివశంకర్, శాన జయవెంకటేష్ పట్టుచీరలను సమర్పించారు. మహాలక్ష్మీదేవిగా అమ్మవారికి వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వెలంపల్లి శ్రీనివాసరావును ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు సాదరంగా స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చిన్నారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులకు దేవస్థానం తరుపున అమ్మవారి ప్రసాదాలు అందించారు. కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, పొట్నూరి రాజా, శీరం వెంకట్రావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావులు సభ్యులు పాల్గొన్నారు. గంగానమ్మ వారి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో తొలి రోజున అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు నిర్వహించగా, ఉమ్మడిశెట్టి వెంకట దుర్గా శివ నాగేంద్ర, నివేదిత, యేదిపాటి వెంకటేశ్వర్లు, అంజలిలు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను కమిటీ గౌరవ అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కుంచెం శ్రీనివాసరావు, పిళ్లా ఏసుబాబు, మాచర్ల సూర్యతేజలు పర్యవేక్షించారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు విజయదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు జరిపించారు.

బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీపురం కోళ్లఫారం రోడ్డులో అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా వ్యవహరించిన స్థానిక దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారు శ్రీగాయత్రి దేవి అలంకారంలో దర్శనం ఇస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో పోలేరమ్మ అమ్మవారు స్వర్ణ కవచ అలంకారంలో దర్శనం ఇచ్చారు. దేవస్థానం పాలకవర్గం అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి నేతృత్వంలో అర్చకులు నగేష్ శర్మ నిర్వహించిన పూజా కార్యక్రమంలో కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మాగం ఆత్మారాము తదితరులు పాల్గొన్నారు.



బాలాత్రిపురసుందరీదేవిగా గంగానమ్మ



వెలంపల్లి శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు



రజితకవచాలంకృత చదునుమహాలక్ష్మిగా అమ్మవారు



రజితకవచాలంకృత భ్రమరాంబాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



బాలాత్రిపుసుందరిదేవిగా పార్వతీ దేవి



పాతశివాలయంలో హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు



విజయదుర్గా అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి నిర్వహించిన కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు



మహాలక్ష్మీదేవిగా కొత్త అమ్మవారు



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో అమ్మవారికి పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు



స్వర్ణకవచ అలంకారంలో దర్శనం ఇచ్చిన పోలేరమ్మ

సాధారణ భక్తులకే అధిక ప్రాధాన్యం

హోం మంత్రి అనిత

వించిపేట(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాల్లో మొదటి రోజైన సోమవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శ్రీ బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్‌లో మాట్లాడారు. దసరా ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత ఏడాది 13 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఈ ఏడాది 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా 36 ప్రభుత్వ శాఖలు, 4500 మంది పోలీసు సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వీఐపీ భక్తుల కోసం ప్రత్యేక స్లాట్స్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం క్యూలైన్‌లను పరిశీలించి ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడారు.



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన హోం మంత్రి అనిత

బహుళ ప్రయోజనకరంగా ఫుట్‌బ్రిడ్జి



ఫుట్‌బ్రిడ్జిపై నుంచి బ్రాహ్మణ వీధి

- రథం సెంటర్‌లో ఏర్పాటు చేసిన దేవస్థానం
- ట్రాఫిక్ నుంచి పాదచారులకు ఉపయోగం
- కేశఖండనశాలకు వెళ్లే భక్తులకు దగ్గర దారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రథం సెంటర్‌లో దుర్గగుడి దేవస్థానం ఏర్పాటు చేసిన ఫుట్‌బ్రిడ్జి బహుళ ప్రయోజనాలను కల్పిస్తుంది. దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల సమయంలో భవానీపురం పరిసరాలకు చెందిన భక్తులు టోల్‌గేట్ వద్ద క్యూలైన్‌లో కలిసేందుకు నేషనల్ హైవేపై ఈ ఫుట్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే ఈ ఏడాది భక్తులను అండర్ పాస్ మీదుగా క్యూలైన్‌లోకి కలుపుతూ పనులు చేపట్టారు. ఉత్సవాల అనంతరం ఈ ఫుట్‌బ్రిడ్జిని కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీకి చెందిన స్థలంలో ఉంచారు. అయితే అమ్మవారి మూలధనాన్ని లక్షలాది రూపాయలు వెచ్చించిన కొనుగోలు చేసిన ఫుట్‌బ్రిడ్జి నిరుపయోగంగా మారుతుందని భక్తులందరూ భావించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఫుట్ బ్రిడ్జిని రథం సెంటర్‌కు తరలించి క్యూలైన్ల మీదుగా ఏర్పాటు చేయడంతో ఎంతో ఉపయోగకరంగా మారింది. ముఖ్యంగా బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీద నుంచి వచ్చే భక్తులు వినాయకుడి గుడి వరకు వెళ్లకుండా సులభంగా ఫుట్‌బ్రిడ్జి ఎక్కి కెనాల్ వైపు దిగుతున్నారు. మరో వైపు అమ్మవారిని దర్శించుకుని కనకదుర్గనగర్‌కు చేరుకునే భక్తులు ఈ ఫుట్‌బ్రిడ్జి మీదగా నడిచి బస్టాండ్‌కు చేరుకునే వీలు కలుగుతుంది. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనం తర్వాతైనా, ముందుగానైనా సీతమ్మ వారి పాదాల వద్ద ఉన్న కేశఖండనశాలకు ఈ ఫుట్‌బ్రిడ్జి దాటి వెళ్లడం ఎంతో సులభం. గతంలో సీతమ్మ వారి పాదాల వద్దకు చేరుకోవాలంటే కెనాల్‌రోడ్డులో ట్రాఫిక్, భక్తుల మధ్య తోపులాటతో వినాయకుడి, వీఎంసీ కార్యాలయం మీదగా కేశకండనశాలకు, బస్టాండ్‌కు వెళ్లే పరిస్థితులు ఉండేవి. తాజాగా రథం సెంటర్‌లో ఫుట్‌బ్రిడ్జిని ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ మధ్య నుంచి నడుచుకుంటూ వెళ్లే పరిస్థితులు తొలగిపోయ్యాయని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



రథం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌బ్రిడ్జి



ఫుట్‌బ్రిడ్జి నుంచి కెనాల్ వైపు దిగుతున్న భక్తులు

• ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

అజిత్‌సింగ్‌నగర్: ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలకు విచ్చేయుచున్న భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక లడ్డూ ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. కనకదుర్గ నగర్‌లో 11 కౌంటర్లతో పాటు సమాచార కేంద్రం వద్ద కూడా ప్రసాదాల కౌంటర్లను సైతం భక్తులకు అందుబాటులో ఉంచారు.